

# పట్టుత్తరీయం

సత్యం శంకరమంచి

మంగి చాపమీద పడుకుందేకాని, మనసంతా గుబులు గుబులుగా వుంది. గుడిసెలో ఓ పక్క ముసలిది గుర్రుపెడుతోంది. పంటేది ఎప్పుడో నిద్రకు పడింది. ఎనిమిది దాటుతున్నా వీరేశు తిరిగి రాలేదు. తనపక్కన మనసిచ్చినవాడు, తాళికట్టిన వాడు, ఆరడుగుల మడిసి పందుకుని వుంటే తన కెంత ధైర్యం.

చిమ్మ చీకటి. తొమ్మిదైనా వీరేశు రాలేదు. మంగి పక్కనున్న ఖాళీ జాగా భయంకరంగా వుంది. పొద్దుట నుంచి మొగుడి మీద విసుక్కుంది, కసు క్కుంది. కోపంతో నెత్తురుడికి పోయేదాకా నరాలు పెట్లిపోయేటట్లు అనరాని మాటలు అంది. ఇప్పుడు వల్లబడిపోయింది. మనసంతా ఆడిమీదే!పక్కన లేని మొగుడు నిద్ర పట్టనివ్వడం లేదు. కొడవలికి కొడవ లందించి తనతో గడ్డి కోసేటివాడు, మంగళసూత్రం చిక్కుపడ్డదంటే సరిచేస్తూ వేళ్ళతో మెడమీద గిలి గింతలు పెట్టేవాడు. దీపాలదిన్నెమీద ఎన్నెట్లో కూర్చుంటే గులకరాళ్ళన్నీ ఏరి తన వొళ్ళో పోస్తూ, తన కళ్ళలోకి మూస్తూ ఆ రాళ్ళు లెక్కపెట్టేవాడు. వంటేదాన్ని చేతికిస్తే ఇంత ముకం చేసుకుని దాన్ని ముద్దాడి అంత ముకంతో తన్ని ముద్దాడినవాడు... వాడు రాలేదు... వస్తాడు. తప్పకుండా వస్తాడు... ఎంత పొద్దయినా వస్తాడు. ఆడి కోసం గంజి పొయ్యి సెగనే వుంచింది. ఆడుక్కొచ్చిన ఆవకాయ బద్ద, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ భద్రం చేసింది. అయినా రాలేదు...

దీని కంతటికీ పొద్దుటి గొడవ కారణం.

పొద్దుట పది గంటల వేళ సుబ్బయ్య బట్టల మూట తీసికొచ్చి "వంటి దానికి నెమిలి కంఠం రంగు గుడ్డ వుంది కొంటావా?" అన్నాడు. ఎండలో చలి కాచుకుంటున్న ముసలి పరుగున వచ్చి "ఏదేది చూపించు" అంది. డబ్బుల్లేకపోతే సూడ్డమెందుకు వొద్దంది మంగి. "సూస్తే తప్పేంటే?" అని ముసల్ది ముందుకొచ్చేసరికి సుబ్బయ్య మూట విప్పి బట్ట చూపించాడు. నెమిలికంఠం రంగు మెరిసిపోతంది.

"ఎంత" అంది ముసల్ది.

"డబ్బుల్లేకుండా బేరం కూడానా?" విసుక్కుంది మంగి.

మంగి మాట వినకుండా ఇద్దరూ బేరమాడుతున్నారు.

'ఆరు'

'అబ్బే రెండు'

'మంచి బేరమే! ఐదు'

'అయితే అక్కర్లేదు. రెండున్నర'

'గిట్టదు. పోన్లే పిల్లదానికి మూడు చేసుకో' అంటూ పిల్లదానిమీద గుడ్డ గిరవాటేశాడు.

నిజం చెప్పొద్దూ! ఆ గుడ్డలో పిల్ల మెరిసిపోయింది. మంగి సంబరపడింది.

లోపలకెళ్ళి ముంతలో దాచిన చిల్లర వెతికితే రెండు ముప్పావలయింది. 'అత్తా! పావలత్తక్కువయింది' అని మంగి అరిస్తే "నువ్వు నా కిచ్చిన పావల ఆ మూలన పాతిపెట్టినా" అంటూ ముసల్ది లోపలికెళ్ళింది.

ఇంతలో వీరేశు వచ్చాడు. సుబ్బయ్య వీరేశుని చూసి "ఓరయ్యా నీకు మిరప్పళ్ళ పట్టుత్తరీయం వుందిరా! అదేస్తే నువ్వు దొరబాబులా వుంటావు" అనట మేమిటి ఉత్తరీయం తీసి వాడిక్కట్టడమేమిటి క్షణంలో జరిగిపోయింది. వీరేశు మెరిసిపోయే ఉత్తరీయం సరిచేసుకుంటూ, మీసం మెలేశాడు. "డబ్బుల్లేవే" అంటూనే 'ఎంత' అనడిగాడు. "పిగ్గా బట్టే పది" అన్నాడు సుబ్బయ్య, 'అబ్బే నాలుగు' ఇలా బేరం ఆడీ ఆడీ ఆరుకి పైసలయింది.

ఇంతలో మూడు రూపాయిల్తో మంగి వాకిట్లో కొచ్చింది. వీరేశు ఆ మూడు పటుక్కున లాక్కుని "నువ్వు పుట్టింటికాడనించి తెచ్చిన మూడు ఇయ్యే! ఈ పట్టు కండువా కొనుక్కుంటా" అన్నాడు.

"ఓరిపీ, అది పిల్లదాని గుడ్డకిరా...నువ్వేంజేసినా సరే నా పుట్టింటి సొమ్మియ్యను" అరిచింది మంగి.

"నేన్నీ మొగుణ్నే! నాకు మూడు రూపాయిలియ్య వంటే...సూస్తానే ఎట్టియ్యవో.." అంటూ రయ్యన లోపలికి పరుగెత్తి ముంత ధడేల్న పగలగొట్టాడు. "ఓర్నాయనో!" అని శోకాలు పెడ్తున్న మంగిని పక్కకు తోసేసి సుబ్బయ్య చేతిలో డబ్బు పోశాడు. డబ్బు నెమలికంఠం గుడ్డతో మూట కూడా సొంతం కట్టుకోకుండా పారిపోయాడు సుబ్బయ్య.

గుడిశెలో నిశ్శబ్దం. ముసల్ది గుడ్ల నీరు గుడ్ల కుక్కుకుంది. మౌనంగా గంజి యిచ్చింది మంగి. వీరేశు తాగి మూతి తుడుచుకుని తలకి మాన్నె రాసుకు దువ్వుకుని చలవ పంచె కట్టుకుని పట్టుత్తరీయం మీదేసుకుని వాకిట్లో కొచ్చాడు. పెళ్ళాం 'కండువా బాగుంది' అంటుందేమో అనుకున్నాడు. అనలేదు. తనే అడిగాడు "కండువా బాగుందికదే?" మంగి మాట్లాడలేదు. వెళ్ళిపోయాడు. రాత్రయినా తిరిగి రాలేదు.

పదయింది. పన్నెండయింది. వీరేశు రాలేదు. గంజి చల్లారింది. పొయ్యారిపోయింది. రాలేదు. తెల్ల వారుఝాము తడిక తోసుకు వస్తాడనుకుంది. రాలేదు. తెల్లారి తను బయట కెళ్ళేసరికి పలుదోము కుంటూ బయట వుంటాడనుకుంది. తెల్లవారి మూస్తే బయట లేదు. కళ్ళనీళ్ళయిపోతోంది మంగి. కన్పిస్తే కాళ్ళమీద పడదామనుకుంది. వీరేశు రాలేదు.

తొమ్మిదయింది. చల్లారిన గంజి ముసలి దానికిచ్చి మళ్ళీ గంజి పొయ్యి మీద పెట్టింది. తానమాడి దొడ్లోంచి వస్తోంటే గుడిశెముందు వీరేశు మాటలు విన్పించాయి. గుండె పొర్లింది మంగికి. వెళ్ళి కావలిం చుకుందామనుకుంది. ఇంతలో తిరిగి కోపం తెర్లింది. వెళ్ళలేదు.

తేరిచూస్తే తన పట్టుకండువా చింపించి పిల్లకి రెండు గౌనులు కుట్టించి ఒక గౌను దానికి తొడిగి రెండోది దాని తలకి చుట్టే అది నవ్వుతుంటే తను కేరింతలు కొడుతున్నాడు. మంగి పొంగిపోయింది. మాట్లాడకుండా వేడి వేడి గంజి, ఆవకాయ బద్ద, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ వీరేశు ముందు పెట్టింది.

◆

"పట్టుమని పదేళ్ళు లేవు. వెధవా! పాడు బుక్స్ చదువుతావా?" టీచర్ పద్మ విలేసింది.

"ఇది పాడు బుక్ అని నాకు తెలీదు టీచర్. బొమ్మలు బావున్నా యని చూస్తున్నానంతే" అమాయకంగా చెప్పాడు సుధాకర్.

పద్మశ్రీ, (మాణిక్యారం)

అసలు సంగతి

"ఇరవయ్యారున మా అబ్బాయి పెళ్ళి ... ముహూర్తం పదిన్నరకి. నువ్ తప్పక రావాలి" చెప్పాడు రామనాథం.

"డిన్నర్ ఎన్ని గంటలకి?" ఆశగా అడిగాడు గుర్నాథం.

—ఎ.వి.ఆర్. ప్రసాద్, వెల్లూరు.